# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 45 | పేజీలు: 4 | వెల: 4/- | శుక్రవారం ● 06, సెప్టెంబర్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి




### సిఎంను ఆహ్వానించిన
## ఖైరతాబాద్ ఉత్సవ కమిటీ

**హైదరాబాద్,సెప్టెంబర్5(నమస్తే ఉదయం):** వినాయక నవరాత్రి ఉత్సవాలకు రావాలని సిఎం రేవంత్ రెడ్డిని ఖైరతాబాద్ శ్రీ గణేశ్ ఉత్సవ కమిటీ ఆహ్వానం అందించింది. జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రికను అందచేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అర్చకులు ఆశీర్వచనం అందించారు.




### ప్రపంచగతిని మార్చేస్తున్న
# సరికొత్త ఆవిష్కరణలు

- ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌తో ప్రపంచమే మారుతోంది
- కొత్త ఆవిష్కరణలు ప్రజల జీవితాల్లో పెను మార్పులు
- ఎఐతో సరికొత్త భవిష్యత్తును ఆవిష్కరిద్దాం
- 'గ్లోబల్ ఏఐ' సదస్సులో సిఎం రేవంత్ రెడ్డి పిలుపు

**హైదరాబాద్,సెప్టెంబర్5(నమస్తే ఉదయం):** సరికొత్త ఆవిష్కరణలు ప్రపంచాన్ని మార్చాయని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నేటి తరం అద్భుత ఆవిష్కరణ ఏఐ అని కొనియాడారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో రాష్ట్ర ఐటీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'గ్లోబల్ ఏఐ' సదస్సుకు సీఎం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. హైదరాబాద్‌లో జీపీయూ ఆధారిత ఏఐ క్లౌడ్ ఏర్పాటులో భాగస్వామ్యంలో సదస్సులో చర్చించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడారు. కొత్త ఆవిష్కరణలు ప్రజల జీవితాల్లో మార్పులు తెస్తాయి. అవి ఆశలతో పాటు భయాన్నీ తీసుకొస్తాయి. విప్లవాత్మక మార్పులకు హైదరాబాద్ మాదిరిగా ఏ నగరమూ సిద్ధంగా లేదు. ఏఐ ద్వారా భవిష్యత్తుకు బలమైన పునాది వేశాం. నాస్కామ్ సహకారంతో ఏఐ ఫ్రేమ్ వర్క్‌కు రూపకల్పన జరుగుతుంది. ఆవిష్కరణలకు పారిశ్రామిక నిపుణులతో రాష్ట్ర ప్రభుత్వం కలిసి పనిచేస్తోంది. అందరం కలిసికట్టుగా సరికొత్త భవిష్యత్తును ఆవిష్కరిద్దాం అని



పిలుపునిచ్చారు. రైల్ ఇంజిన్, టీవీ, కెమెరాతో ప్రారంభమైన ఆవిష్కరణలు ఇప్పుడు ఆర్టిఫీషియల్ దాకా వచ్చాయిన సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. క్రమంగా టెక్నాలజీ పెరుగుతోంది.. ఎన్నికల ముందు డిక్లరేషన్ లో చెప్పినట్టే ఎఐ కి మొదటి ప్రాధాన్యత ఇస్తూ పెట్టబడి దారులను ఆహ్వానిస్తున్నామనం ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఎఐ రంగంలో పరిజ్ఞానం ఉన్నవారికి అవకాశాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని సీఎం అన్నారు. కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ఏఐ రోడ్ మ్యాప్‌ను ఆవిష్కరించారు. రాబోయే రెండు, మూడేళ్లలో రాష్ట్రంలో ఏఐ అభివృద్ధికి చేపట్టే చర్యలను ఇందులో పేర్కొన్నారు. ఈ సదస్సుకు వివిధ ఐటీ సంస్థల ప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ఏఐలో పూర్తిగా పట్టు సాదించబోతున్నామన్నారు. తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఏటా అభివృద్ధి సాధిస్తూ ముందుకు వెళ్తున్నామన్నారు. డీప్‌ఫేక్ లాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఏఐని సరైన దారిలో ఉపయోగించుకుంటామని చెప్పారు. ప్రపంచస్థాయి

మిగతా.. 2లో



## శివాజీ విగ్రహ తయారీలో అవినీతి

- అందుకే కూలిందన్న రాహుల్

**పుణె,సెప్టెంబర్5(నమస్తే ఉదయం):** మహారాష్ట్రలో ఛత్రపతి శివాజీ విగ్రహం కూలడానికి కారణం విగ్రహం తయారీలో శిల్పి అవినీతి ఉందని కాంగ్రెస్ ఎంపి, విపక్షనేత రాహుల్ గాంధీ అన్నారు. దీనిపై ప్రధాని నరేంద్ర

మిగతా.. 2లో

## భారీ వర్షానికి తీవ్ర నష్టం వాటిల్లింది

- వరద బాధితులకు ఉడతా భక్తిగా సహాయం
- బాధితులకు సరకులు పంపిణీ
- వాహనాలకు హరీష్ రావు జెండా

**సిద్దిపేట,సెప్టెంబర్5(నమస్తే ఉదయం):** మ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షానికి తీవ్ర నష్టం వాటిల్లిందని, వరద బాధితులకు సిద్దిపేట నుంచి ఉడత భక్తిగా సహాయం చేస్తున్నామని బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్ రావు తెలిపారు. మానవ సేవయే మాధవ సేవ అని అందరూ ముందుకు వచ్చి వరద బాధితులకు సహాయం

మిగతా.. 2లో



## వరదలపై బీఆర్ఎస్ బురద రాజకీయాలు

- విమర్శించడమే బీఆర్ఎస్ నాయకులకు పని
- ట్విట్టర్‌లో విషం చిమ్ముతున్న కెటిఆర్
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆగ్రహం

**హైదరాబాద్,సెప్టెంబర్5(నమస్తే ఉదయం):** వరదలపై బీఆర్ఎస్ పార్టీ బురద రాజకీయాలు చేస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆరోపణలు చేశారు. వరద కష్టాల్లో కూడా కల్వకుంట్ల కుటుంబానికి రాజకీయాలే కనిపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. గురువారం హైదరాబాద్ సీఎల్పీ మీడియా హాల్లో ఆది శ్రీనివాస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. .కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడమే బీఆర్ఎస్ నాయకులకు పనిగా మారిందని మండిపడ్డారు. అనుకోని విపత్తు వచ్చినప్పుడు రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించకుండా విమర్శలు చేస్తారా అని ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు.సహాయక చర్యలపై ప్రభుత్వానికి సలహా, సూచనలు ఇవ్వ కుండా నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. మాజీ మంత్రి కేటీఆర్ అమెరికాలో ఎంజాయ్ చేస్తూ ట్విట్టర్‌లో విషం చిమ్ముతున్నారని ఆరోపణలు చేశారు. ప్రతిపక్ష నేత కేసీఆర్



అడ్రస్ ఇప్పటివరకు తెలియదని ఆక్షేపించారు. కేసీఆర్ ఎక్కడున్నారు.. ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఫాంహౌస్‌లో ఉన్నారా లేక నంది నగర్‌లో ఉన్నారా అని ఆది శ్రీనివాస్ నిలదీశారు. వరద బాధితుల కుటుంబాలకు కనీసం

మిగతా.. 2లో



### కేజీవ్రాల్ బెయిల్ పిటిషన్‌పై
## తీర్పు రిజర్వ్

- తీర్పును 10కి వాయిదా వేసిన సుప్రీం ధర్మాసనం

**న్యూఢిల్లీ,సెప్టెంబర్5(నమస్తే ఉదయం):** ఢిల్లీ మద్యం విధానంలో మనీ ల్యాండరింగ్ వ్యవహారంలో సీఎం అరవింద్ కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌తోపాటు తన అరెస్ట్‌ను సవాల్ చేస్తూ.. దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు గురువారం విచారణ

మిగతా.. 2లో



### ఛత్తీస్‌ఘఢ్ సరిహద్దుల్లో
## మరో ఎన్‌కౌంటర్

- ఆరుగురు మావోలను హతమార్చిన పోలీసులు

**భద్రాద్రికొత్తగూడెం,సెప్టెంబర్5 (నమస్తే ఉదయం):** ఛత్తీస్‌గఢ్ తెలంగాణ సరిహద్దుల్లోని ప్రాంతాలు తుపాకీ మోతలతో దద్దరిల్లిపోతోంది. దంతెవాడ ఎన్కౌంటర్ మరువకముందే ములుగు జిల్లా సరిహద్దుల్లో మరో ఎన్కౌంటర్ జరిగింది. ములుగు, కొత్తగూడెం

మిగతా.. 2లో



## బిజెపి మాటలకు.. చేతలకు చాలా తేడా

- రాష్ట్రం అతలాకుతలం అయినా పట్టింపులేని నేతలు
- విమర్శలు వస్తున్నా పట్టించుకోని నాయకగణం

**హైదరాబాద్,సెప్టెంబర్5(నమస్తే ఉదయం):** డబుల్ ఇంజన్ సర్కార్ కావాలి..తెలంగాణలో తదుపరి తమదే ప్రభుత్వం అంటున్న బిజెపి.. ప్రజలకు సేవలు

మిగతా.. 2లో



## నిండుకుండలా నిజాంసాగర్ జలాశయం

- మూడు గేట్లు ఎత్తి 15వేల క్యూసెక్కుల నీటి విడుదల

**కామారెడ్డి,సెప్టెంబర్5(నమస్తే ఉదయం):** కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ జలాశయం నిండుకుండలా మారింది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో భారీగా వరద అక్కడికి చేరుతోంది. దీంతో మూడు గేట్లు ఎత్తి 15వేల క్యూసెక్కుల నీటిని మంజీరా నదిలోకి విడుదల చేస్తున్నారు. ఈ మేరకు జలవనరులశాఖ అధికారులు తెలిపారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు. ప్రస్తుతం 1,404 అడుగులకు చేరుకుంది. దీంతో మూడు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్‌కు భారీ వరద కొనసాగుతున్నది. ఎగువ మహారాష్ట్ర, గోదావరి పరివాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు

మిగతా.. 2లో

### ఎలక్ట్రిక్ వాహనాలకు
## ఇక రాయితీ చెల్లు

- డిమాండ్ పెరగడంతో సబ్సిడీలు అవసరం లేదు
- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి

**న్యూఢిల్లీ,సెప్టెంబర్5(నమస్తే ఉదయం):** దేశంలో త్వరలో ఈవీల రేట్లు పెరిగే అవకాశం ఉంది. దేశంలోని ఎలక్ట్రిక్ వాహనాలకు ఇకపై ప్రభుత్వ రాయితీలు అవసరం లేదని తాజాగా భారత రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. వీటికి డిమాండ్ పెరగడం, ఉత్పత్తి ఖర్చులు తగ్గడం వల్ల ఇకపై సబ్సిడీ అవసరం లేదన్నారు.



ఢిల్లీలో జరిగిన బ్లూమ్‌బెర్గ్ సమ్మిట్‌లో గడ్కరీ ఈ మేరకు పేర్కొన్నారు. ప్రారంభ వ్యయం ఎక్కువగా ఉందని, అయితే డిమాండ్ పెరగడంతో ఉత్పత్తి ఖర్చులు తగ్గాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎలక్ట్రిక్ వాహనాలు ఇప్పటికే అనుకూలమైన పన్నును అనుభవిస్తున్నాయని, కేవలం 5శాతం మాత్రమే ఉందన్నారు. ఇది పెట్రోల్, డీజిల్

మిగతా.. 2లో



## సమాజ ప్రగతిలో ఉపాధ్యాయుల పాత్రకీలకం..

- వారి ప్రోత్సామంతోనే ఇంతటి వారం అయ్యాం
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

**హనుమకొండ,సెప్టెంబర్5(నమస్తే ఉదయం):** సమాజ ప్రగతిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో హనుమకొండ జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం,ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ, పరకాల, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కె.ఆర్.నాగరాజు, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య జ్యోతి ప్రజ్వలన చేసి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ

మిగతా.. 2లో

## ప్రపంచగతిని మార్చేస్తున్న
# సరికొత్త ఆవిష్కరణలు

(మొదటి పేజీ తరువాయి)

యూనివర్సిటీలతో ఒప్పందం కుదుర్చుకుంటున్నామని పేర్కొన్నారు. ఎథికల్ ఏఐ విషయంలో జపాన్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌కు సమీపంలో 200 ఎకరాల్లో ఏఐ సిటీని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రపంచ స్థాయి ఏఐ కంపెనీలు ఇక్కడ ఏర్పాటు అయ్యేలా చూస్తామని వివరించారు. రాబోయే రెండు రోజులు హెచ్ఐసీసీ వేదికగా ఏఐ పైనా చర్చలు, సెమినార్లు ఉంటాయని శ్రీధర్‌బాబు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్ డెవలప్‌మెంట్‌కు మంచి అవకాశాలు ఉన్నాయని శ్రీధర్ బాబు అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దుర్వినియోగం చేయొద్దని ఆయన సూచించారు. హైదరాబాద్ లో 200 ఎకరాలు కేటాయించి ఏఐ సిటీని ఏర్పాటు చేస్తాము. రాబోయే మూడేళ్లల్లో గ్లోబల్ ఏఐ హబ్ గా హైదరాబాద్ అవతరిస్తుందని మంత్రి అన్నారు. ఏఐ పెట్టుబడులకు ఇండియా గమ్యస్థానంగా ఉందని ఐటీ మినిస్టర్ శ్రీధర్ బాబు వివరించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల నుంచి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో నిపుణులైన 2వేల మంది ఏఐ నిపుణులు సదస్సుకు వచ్చారు.

## శివాజీ విగ్రహ
# తయారీలో అవినీతి

(మొదటి పేజీ తరువాయి)

మోడీ క్షమాపణలు చెప్పాలన్నారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ కాంగ్రెస్ నాయకుడు పతంగ్ రావు కదం విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు మహారాష్ట్రలోని సాంగ్లీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతేకాక పెద్ద నోట్ల రద్దు(డీ మానిటైజేషన్), తప్పుడు పద్ధతిలో జిఎస్ టి అమలు చేయడంపై కూడా ప్రధాని మోడీ క్షమాపణలు చెప్పాలన్నారు. సింధుదుర్గ్ లోని రాజ్ కోట్ కోట వద్ద శివాజీ విగ్రహం కూలిపోయింది. ప్రధాని మోడీ గత వారం మహారాష్ట్ర సందర్శించి క్షమాపణలు కూడా కోరారు. 'మహారాష్ట్ర చక్రవర్తి మా ఆరాధ్య దైవం' అని కూడా అన్నారు. 35 అడుగుల శివాజీ విగ్రహాన్ని మోడీ గత ఏడాది డిసెంబర్ 4న ఆవిష్కరించారు. కానీ ఆ విగ్రహం ఆగస్టు 26న కూలిపోయింది. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ ' ప్రధాని మోడీ కేవలం మహారాష్ట్ర రాజుకే కాదు రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి క్షమాపణలు చెప్పాలి' అన్నారు. 'ప్రధాని పెద్ద కాంట్రాక్టులను కొంత మంది పారిశ్రామిక వేత్తలకు ఇస్తున్నందుకు, పెద్ద నోట్లను రద్దు చేసినందుకు(డీమోనిటైజేషన్), తప్పుడు జిఎస్ టి విధానం అవలంబించినందుకు, దానివల్ల చిన్న, మధ్య తరహా వ్యాపారులు దెబ్బతినడమేకాక, తద్వారా నిరుద్యోగం పెరిగినందుకు ప్రధాని క్షమాపణలు చెప్పాలి' అని రాహుల్ గాంధీ అనక్నారు. కోట్ల కొద్ది రూపాయల రుణ మాఫీ బడా పారిశ్రామిక వేత్తలకు చేస్తూ, రైతులకు రుణమాఫీ చేయకపోవడంపై కూడా విమర్శించారు. ధనవంతులకు రుణ మాఫీ చేసినప్పుడు, పేదలకు ఎందుకు చేయరు? అని ప్రశ్నించారు. త్వరలో మహారాష్ట్రలో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్, దాని మిత్రపక్షం(మహా వికాస్ అఘడి కూటమి) గెలిచి రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందన్నారు. ' అవసరమైనప్పుడు నేను ఇక్కడ ఉంటాను' అని భరోసా ఇచ్చారు.

## భారీ వర్షానికి తీవ్ర నష్టం వాటిల్లింది

(మొదటి పేజీ తరువాయి)

చేయాలని పిలుపునిచ్చారు. సిద్దిపేటలోని క్యాంపు కార్యాలయం వద్ద ఖమ్మం వరద బాధితులకు సరకులు పంపే వాహనాలకు మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడారు. సహాయం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజా పాలనా కాదు రాక్షస పాలన నడుస్తుందని, ముందుగా ప్రభుత్వం మేలుకుంటే మరింత ప్రాణ నష్టాన్ని తగ్గించే అవకాశం ఉండేదని హరీష్ రావు చురకలంటించారు. బిఆర్ఎస్ ఎంఎల్ఎలు, ఎంపిలు, ఎంఎల్ సిల నెల వేతనం వరద బాధితులకు అందిస్తున్నామని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ తరహాలో బిజెపి, మిగతా పార్టీల నాయకులు సహాయం చేయడానికి ముందుకు రావాలని కోరారు. తాము వరద బాధితులకు సహాయం చేయడానికి ఖమ్మం వెళ్తే తమపై కాంగ్రెస్ పార్టీ నాయకులు దాడి చేయడంతో పాటు కేసులు నమోదు చేశారని మండిపడ్డారు. వరద బాధితులు కాంగ్రెస్ ప్రభుత్వం పై దుమ్మెత్తిపోశారని, సిఎం రేవంత్ రెడ్డి తాటాకు చప్పుళ్లకు ఎవరు భయపడరని హరీష్ రావు హెచ్చరించారు. బిఆర్ఎస్ కు వస్తున్న స్పందన ను చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ నేతలు దాడులకు తెగపడ్డారని ధ్వజమెత్తారు. బాధితులకు అన్నం, నీళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వలేక పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇండ్లు నీళ్లలో మునిగి పోయిన వారికి రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల రూపాయలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## వరదలపై బీఆర్ఎస్
# బురద రాజకీయాలు

(మొదటి పేజీ తరువాయి)

సంతాపం కూడా తెలపనంత బిజీగా కేసీఆర్ ఉన్నారా అని ప్రశ్నించారు. బాధ్యతాయుత ప్రతిపక్ష నేతగా ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వడానికి కూడా నోరు రావడం లేదా అని ప్రశ్నించారు. మాజీ సీఎం కేసీఆర్ ఫామ్ హౌస్‌లో పడుకుని మాజీ మంత్రి హరీష్‌రావును జనం పైన దాడికి పంపించారని ఆది శ్రీనివాస్ విమర్శలు చేశారు. ఖమ్మంలో బాధితులను పరామ ర్శించకుండా హరీష్‌రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు రెచ్చగొట్టే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. హరీష్?రావు వైఖరి కారణంగా అక్కడ గందరగోళం చోటు చేసుకుందని చెప్పారు. హరీష్‌రావు నోరు తెరిస్తే రాజకీయం తప్ప మరొకటి లేదని ఆక్షేపించారు. గతంలో భారీ వర్షాలు వచ్చినప్పుడు విదేశీ కుట్ర అని కేసీఆర్ తప్పించుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. క్లౌడ్ బరస్ట్ ద్వారా భారీ వర్షాలు కురిపిస్తున్నారంటూ నోటికొచ్చినట్లు అబద్దాలు చెప్పారని విమర్శించారు. ఇప్పుడు మాత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఫల్యం అంటూ కొడుకు, అల్లుడుతో కేసీఆర్ విష ప్రచారం చేయిస్తున్నారని ఆది శ్రీనివాస్ ÷ర్ అయ్యారు. గత పదేళ్లలో చాలాసార్లు వరదలు వచ్చినప్పుడు పరిహారం ఇవ్వకుండా పచ్చి మోసం చేశారని విమర్శలు చేశారు.

గతంలో హైదరాబాద్‌లో వరదలు వచ్చినప్పుడు ఇంటికి రూ. 10 వేలు పరిహారం ఇస్తామని బాధితులను కేసీఆర్ దగా చేశారని ఆరోపించారు. కేసీఆర్‌ను ఫామ్ హౌస్ నుంచి బయటకు తీసుకువచ్చే ధైర్యం బీఆర్ఎస్ నేతలకు ఉందా అని సవాల్ విసిరారు. ప్రజలపై అంత ప్రేమ ఉంటే మాజీ మంత్రి కేటీఆర్ 18 గంటల్లో అమెరికా నుంచి రావొచ్చు కదా అని ఆది శ్రీనివాస్ సవాల్ విసిరారు. ప్రభుత్వం సహాయక చర్యలపై చిత్తశుద్ధితో పనిచేస్తోందని స్పష్టం చేశారు. తమ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రెండు రోజుల పాటు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి బాధితులకు ధైర్యం చెప్పారని గుర్తుచేశారు. వర్షాల కారణంగా చనిపోయిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల పరిహారం అందజేస్తున్నామని అన్నారు. పంట నష్టం జరిగిన ప్రతి ఎకరానికి రూ. 10 వేలు ఇస్తున్నామని గుర్తుచేశారు. ప్రతి ఇంటికి రూ.10 వేల తక్షణ సాయం అందిస్తున్నామని ప్రకటించారు.

చనిపోయిన గేదెలు, గొర్రెలు, మేకలకు కూడా సాయం అందజేస్తామని ఆది శ్రీనివాస్ తెలిపారు. తమ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపైన ఈర్ష్యతోనే ఏపీ సీఎం చంద్రబాబు బాగా పనిచేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు ప్రశంసిస్తున్నారని అన్నారు. కేంద్రం నుంచి తక్షణ సాయం రూ. 20, 000 కోట్లు ఇవ్వాలని అడిగామని.. కానీ కేంద్రమంత్రులు సోది కబుర్లు చెబుతున్నారని మండిపడ్డారు. తెలంగాణలో ఇద్దరు కేంద్ర మంత్రులున్నా రాష్ట్రానికి ప్రయోజనం లేకుండా పోయిందని ఆది శ్రీనివాస్ విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయాలని ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వేముల వీరేశం విషయంలో పొరపాటు జరిగిందని అన్నారు. ఎమ్మెల్యే వేముల పట్ల అమర్యాదగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆది శ్రీనివాస్ హెచ్చరించారు.

# బిజెపి మాటలకు.. చేతలకు చాలా తేడా

(మొదటి పేజీ తరువాయి)

అందించడంలో...వారి కష్టాల్లో పాలు పంచుకోవడంలో మాత్రం శ్రద్ధ చూపడం లేదు. కేవలం పడికట్టు పదాలు, గంభీర ఉపన్యాసాలతో కాలం గడిపేస్తున్నారు. ఖమ్మం, మహబూబాబాద్ అతలాకుతలం అయ్యింది. అయినా పెద్దగా స్పందించలేదు. ఇంతకన్నా దారుణం, ఘోరం మరోటి ఉండదు. ఒక్కరు కాదు...ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నారు. మరో ఆరుగురు ఎంపిలు ఉన్నారు. ప్రజలు వారిని నమ్మి గెలిపించారు. ఇలాంటి విపత్కర సమయంలో మేమున్నామని ముందుకు రాకపోవడం, అదంతా కాంగ్రెస్ తప్పిదమన్న రీతిలో మాట్లాడుతున్నారు. కేంద్రం నిధులు ఉన్నాయి...ఖర్చు పెట్టుకోండని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఓ ఉచిత సలహా పడేశారు. ఇకపోతే తెలంగాణ భారతీయ జనతా పార్టీ నాయకులు అసలైన విషయాలపై స్పందించడం లేదు. ముఖ్య నేతలంతా ఎవరికి వారే అన్నట్లుగా ఉంటున్నారు. ఈ పరిమామం వల్ల అసలు బీజేపీలో ఏం జరుగుతుందో ఎవరికీ అర్థం కావడం లేదు. తాజాగా వరదల విషయంలో కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ పదేపదే సాయం కోరుతోంది. ప్రధాని మోడీకి విజ్ఞప్తి చేసింది. అవసరమైన హెలికాప్టర్లు, పవర్ బోట్లు, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని పంపించలేదని ప్రజల్ని గాలికి వదిలేశారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. వీటిని తెలంగాణ బీజేపీ నేతలు కూడా తిప్పికొట్టలేకపోతున్నారు. మామూలుగా అయితే సాయం చేసి విమర్శలపై ఎదురుదాడి చేయవచ్చు . కానీ ఎవరికి వార తమకెందుకులే అనుకుంటున్నారు. అందు వల్లే ఎవరూ ముందుకు రావడం లేదు. ఖమ్మంకు ఆ స్థాయిలో వరద వస్తుందని ప్రభుత్వం ఊహించలేకపోయింది. బుడమేరు విజయవాడను ముంచింది కాబట్టి... ఆ నీరు ఖమ్మం వైపు వస్తుందని అంచనా వేయలేకపోయారు. చివరికి మున్నేరు పెద్ద ముప్పు తెచ్చి పెట్టింది. ఆరేడు అడుగుల ఎత్తున నీరు పారడం అంటే చిన్న విషయం కాదు. మామూలుగా అయితే గోదావరికి వరదలు వస్తే.. ఖమ్మం జిల్లా ఉలిక్కి పడుతుంది. ఈ సారి మాత్రం అందుకు భిన్నంగ మున్నేరు ముంచేసింది. హెలికాప్టర్లు లేకపోవడం వల్ల చాలా మంది ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వం విమర్శలు ఎదుర్కో వాల్సి వచ్చింది. తర్వాత రోజే రేవంత్ రెడ్డి ఖమ్మం పర్యటనకు వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించారు. మంత్రులు అక్కడే ఉండి సహాయ పునరావాసా చర్యలు చేపట్టారు. అయినప్పటికీ.. ప్రభుత్వం పెద్దగా ఏమ చేయలేదన్న విమర్శలను మూటగట్టుకుంది. అదే అభిప్రాయం ప్రజల్లో ఏర్పడింది. విపత్తు వచ్చినా కేంద్రం కనీసం హెలికాప్టర్ల పంపలేదని.. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని పంపలేదని రుజువు అయ్యింది. పక్కన ఉన్న ఆంధ్రాకు 120 పవర్ బోట్లు, హెలికాప్టర్లు, ఎయిర్ ఫోర్స్ కూడా సాయానికి వెళ్లింది. కానీ తెలంగాణకు ఎంతమాత్రం సాయం అందలేదు. అది కాంగ్రెస్ సర్కార్ వైఫల్యమేనని బీఆర్ఎస్ విమర్శించింది. ఇంత జరుగుతున్నా తమపై వస్తున్న విమర్శలకు బీజేపీ కౌంటర్ చేయలేకపోతోంది. దీనికి కారణం సమాధానం లేకపోవడం కాదు. నేతలు పెద్దగా పట్టించుకోకపోవడమే. తెలంగాణ బీజేపీలో ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదు. ఒక్క లీడర్ కూడా బాధ్యత తీసుకోవడం లేదు. మరీ ముఖ్యంగా వరద పరిస్థితుల్లో బిజెపి పూర్తిగా విఫలం అయ్యింది. కేవలం విమర్శలకే పరిమితం అయ్యింది. బిజెపిలోఎవరికి వారు సొంత ఎజెండా ప్రకారం స్పందించడం అలవాటు చేసుకున్నారు. అందుకే వారు కేంద్రాన్ని కూడా గట్టిగా నిలదీయడం లేదు.

# ఛత్తీస్‌ఘఢ్ సరిహద్దుల్లో మరో ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

జిల్లాల సరిహద్దుల్లో జరిగిన భారీ ఎన్కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. ములుగు జిల్లా సరిహద్దు దామెర తొడుగు అటవీ ప్రాంతంలో పోలీసులకు మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందగా... మరి కొందరు గాయపడినట్టు తెలుస్తోంది. ఎదురుకాల్పుల ఘటనలో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారు. కరకగూడెం మండలం రఘునాథపాలెం సమీపంలోని అటవీ ప్రాంతంలో పోలీసులు-మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. మృతుల్లో మణుగూరు ఏరియా కమిటీ కార్యదర్శి లచ్చన్న సహా ఆయన దళానికి చెందిన ఆరుగురు ఉన్నట్లు గుర్తించారు. ఈ కాల్పుల్లో గ్రేహౌండ్ కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలయ్యాయి. రఘునాథపాలెం ప్రాంతంలో గత కొంతకాలంగా ఈ దళం కార్యకలాపాలు కొనసాగిస్తోంది. ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చిన ఈ దళానికి లచ్చన్న నాయకత్వం వహిస్తున్నారు. మృతుల్లో లచ్చన్నతో పాటు తులసి, శుక్రాం, రాము, దుర్గేష్, కోసి ఉన్నట్లు గుర్తించారు. మావోయిస్టులకు గడ్డు కాలం ఉన్నట్టు ఉంది. వరుస ఎన్‌కౌంటర్లు వారికి కంటిమీద కనుకులేకుండా చేస్తున్నాయి. బుధవారం ఛత్తీస్‌గడ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పదిమంది వరకు మృతి చెందారు. ఇప్పుడు తెలంగాణలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు హతమయ్యారు.

# కేజీవ్రాల్ బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

(మొదటి పేజీ తరువాయి)

జరిపింది. అందుకు సంబంధించిన తీర్పును సుప్రీంకోర్టు రిజర్వ్ చేసింది. ఢిల్లీ సీఎం కేజీవాల్ దాఖలు చేసిన పిటిషన్లపై గురువారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయన్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం విచారించింది. అనంతరం ఈ కేసులో తీర్పును మంగళవారానికి సుప్రీంకోర్టు ధర్మాసనం రిజర్వ్ చేసింది. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బెయిల్‌తోపాటు తనను అరెస్ట్ చేయడంపై ఢిల్లీ సీఎం అరవింద్ కేజీవ్రాల్ సుప్రీంకోర్టులో రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో ఈ పిటిషన్లపై విచారించిన సుప్రీంకోర్టు.. తన తీర్పును సెప్టెంబర్ 10వ తేదీకి వాయిదా వేసింది.

ఏడాది మర్చి 21వ తేదీన ఢిల్లీ మద్యం కుంభకోణంలో మనీ ల్యాండరింగ్ వ్యవహారంలో ముఖ్యమంత్రి అరవింద్ కేజీవ్రాల్‌ను ఈడీ అరెస్ట్ చేసింది.

అనంతరం తీహాడ్ జైలుకు ఆయన్ని తరలించింది. జూన్ 26న ఆయన్ని సీబీఐ అరెస్ట్ చేసింది. ఆ క్రమంలో మనీ ల్యాండరింగ్ వ్యవహారంలో సుప్రీంకోర్టు సీఎం కేజీవ్రాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. కానీ అప్పటికే ఆయన్ని సీబీఐ అరెస్ట్ చేయడంతో.. కేజీవ్రాల్ తీహాడ్ జైల్లోనే ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. క ఈ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజీవ్రాల్ మాత్రమే జైల్లో ఉన్నారు. ఈ ఆగస్ట్‌లో ఇదే కేసులో ఆరోపణలు ఎదుర్కొని అరెస్టయిన ముగ్గురు.. ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కె. కవిత, ఆప్ పార్టీ కమ్యూనికేషన్ మాజీ ఇన్‌ఛార్జ్ విజయ్ నాయర్‌లు బెయిలుపై విడుదలయ్యారు. ఇక ఇదే కేసులో గతంలో అరెస్టయిన ఆప్ రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ ఈ ఏడాది ఏప్రిల్‌లో బెయిల్‌పై విడుదలైన సంగతి తెలిసిందే.

# ఎలక్ట్రిక్ వాహనాలకు ఇక రాయితీ చెల్లు

(మొదటి పేజీ తరువాయి)

వాహనాలతో పోలిస్తే చాలా ఎక్కువ ప్రయోజనాన్ని అందజేస్తుందని గడ్కరీ వెల్లడించారు. ఈ క్రమంలో సబ్సిడీ డిమాండ్ ఇకపై సమర్థించ బడదని కేంద్ర మంత్రి భావించారు. ఈ నేపథ్యంలో క్లీన్ ఎనర్జీ వైపు విస్తృతంగా మారాలని గడ్కరీ సూచించారు. కానీ దేశంలో ఇంకా పెట్రోలు, డీజిల్‌పై భారతదేశం ఆధారపడటం ఒక ఆందోళనకర విషయమని గడ్కనీ అన్నారు. కానీ పెట్రోల్, డీజిల్ వాహనాలపై అదనపు పన్నులు విధించే అంశాన్ని ఆయన తిరస్కరించారు. ప్రజా రవాణాలో ఇ÷ఎల విస్తరణ గురించి ప్రస్తావించారు. పెట్రోల్ డీజిల్ వాహనాలపై ఆధారపడటం వల్ల కాలుష్య స్థాయిలు పెరుగుతున్నాయని, ఇలాంటి క్రమంలో ఎలక్ట్రిక్ బస్సులు కీలక పాత్ర పోషిస్తాయని నితిన్ గడ్కరీ అన్నారు. అయితే ప్రభుత్వం ఇయూ కంపెనీలకు ఇచ్చే సబ్సిడీ కారణంగా కొనుగోలుదారులు కొంత ప్రయోజనం పొందుతున్నారు. ఇకపై త్వరలో సబ్సిడీ ముగిస్తే ఆ భారాన్ని కంపెనీలు వినియోగదారులపై మోపే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం వాహనం కొనుగోలు చేసే సమయంలో ప్రభుత్వం ఇ÷వ వినియోగదారులకు తగ్గింపులను అందిస్తుంది. కంపెనీలు డిస్కౌంట్లను పొందడం ఆపివేస్తే, కస్టమర్లకు కూడా ఈ డిస్కౌంట్లను కంపెనీలు నిలిపివేసే అవకాశం ఉంది. ప్రస్తుతం ద్విచక్ర వాహనాలపై 40 శాతం వరకు తగ్గింపు అందుబాటులో ఉంది. అదేవిధంగా త్రీవీలర్లు, నాలుగు చక్రాల వాహనాలపై కిలోవాట్‌కు రూ.10,000 వరకు రాయితీ ఇస్తున్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న తాత్కాలిక ఎలక్ట్రిక్ మొబిలిటీ ప్రమోషన్ స్కీమ్ 3 సెప్టెంబర్ 2024లో ముగుస్తుంది.

# సమాజ ప్రగతిలో ఉపాధ్యాయుల పాత్రకీలకం..

(మొదటి పేజీ తరువాయి)

తాము చదువు చెప్పిన విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకుంటే గురువులు ఎంతో సంతోషపడతారని పేర్కొన్నారు. ప్రతి విజేత కూడా తన విజయానికి కారణం గురువులే అని చెబుతుంటారని అన్నారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేది ఉపాధ్యాయులేనని తెలిపారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను మరింత మెరుగు పరిచే విధంగా గురువులు తోడ్పాటునందించి ఉన్నత స్థాయికి చేరడంలో కృషి చేస్తారన్నారు. కరోనా సమయంలో పిల్లలకు మొబైల్ ఫోన్లను ఇవ్వడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. విద్యార్థులను సమగ్ర మూర్తిమత్వంతో గురువులు తీర్చిదిద్దా లన్నారు. ఈ సందర్భంగా గురువులందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్నవారికి అభినందనలు తెలియజేశారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ దేశ భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసేది గురువులేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం అధికారంలోకి రావడంలో ఉపాధ్యాయుల సహకారం కూడా ఎంత ఉందన్నారు. రాబోయే రోజులలో కొత్త వరంగల్ ను చూడబోతున్నారని తెలిపారు. కొత్త వరంగల్ ను చూడడంలో ఉపాధ్యాయుల భాగస్వామ్యం ఉండాలన్నారు. ఇటీవల నిర్వహించిన ఉపాధ్యాయ బదిలీలను అత్యంత పారదర్శకంగా నిర్వహించు కున్నామని పేర్కొన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా సభాధ్యక్షత వహించడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో మార్పు రావాలంటే అది ఉపాధ్యాయులతోనే సాధ్యమని పేర్కొన్నారు. సమాజంలోని వివిధ వర్గాలు ఉపాధ్యాయుల పైన ఎంతో నమ్మకం కలిగి ఉంటారని తెలిపారు. ఉపాధ్యాయులు చేసే సేవలను కొలువలేమని , సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ఎంతో గౌరవం ఉందన్నారు. గురువులు అందించిన ప్రోత్సాహంతోనే ఈ స్థాయిలో మీ ముందున్నానని చెప్పారు. ఉత్తమ ఉపాధ్యాయులకు ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ ఈ స్థాయిలో ఉండడానికి తన గురువులే కారణమని తెలిపారు. తాను డాక్టర్ అవుదామని అనుకున్నానని, కానీ కాలేకపోయానని చెప్పారు. తన గురువు కొమురయ్య జాతీయస్థాయిలో క్రీడాకారునిగా రాణించేలా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. సమాజంలో ఎవరి నుంచి ఏమీ ఆశించని ఉద్యోగం ఏదైనా ఉందంటే అది ఉపాధ్యాయ వృత్తి మాత్రమేనని అన్నారు. అజ్ఞానం నుండి విజ్ఞానం వైపు నడిపించే వారే గురువులని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ విద్యార్థులకు ఉపాధ్యాయులు అందించే విద్యనే అన్ని రంగాల్లో రాణించేలా తోడ్పడుతుందని అన్నారు. విద్యార్థులు ఉన్నతంగా రాణించాలంటే ఉపాధ్యాయుల కృషి ఎంతో అవసరమని పేర్కొన్నారు . జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను అందజేస్తున్నట్లు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు సమకూరాయని పేర్కొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉందని, ఈ సందర్భంగా ఉపాధ్యాయులందరికీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ ప్రగతి నివేదికను జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి వివరించారు. ఉత్తమ పనితీరుతో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 31మంది ఉపాధ్యాయులను ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు రాజేందర్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, కె ఆర్ నాగరాజు, కలెక్టర్ ప్రావీణ్య శాలువాతో సత్కరించి జ్ఞాపికలను అందించి అభినందనలు తెలియజేశారు. హనుమకొండ లోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ పాఠశాల విద్యార్థులు చేసిన స్వాగతం నృత్యం, పాడిన పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో 49వ డివిజన్ కార్పొరేటర్ ఏనుగుల మానస, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నగరంలో మరోమారు
# ఫుడ్ సేఫ్టీ దాడులు

### పలు రెస్టారెంట్లలో దాడులు..
### కాలం చెల్లిన పదార్థాలు గుర్తింపు

**హైదరాబాద్,సెప్టెంబర్5(నమస్తే ఉదయం):** జూబ్లీహిల్స్‌లోని పలు రెస్టారెంట్లపై ఫుడ్ సేఫ్టీ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. తెలుగు మీడియం రెస్టారెంట్‌లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా కాలం చెల్లిన జ్యూస్‌లు, పుట్టగొడుగులు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. అలాగే రెస్టారెంట్ ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన చికెన్, మటన్‌లను కనుగున్నారు. ఈ సందర్భంగా రెస్టారెంట్‌పై కేసు నమోదు చేశారు. అనంతరం రెస్టారెంట్ యాజమాన్యానికి షాకోజ్ నోటీసులు జారీ చేశారు. బిర్యానీలో వెంట్రుకులు వచ్చాయంటూ.. ఇటీవల ఓ కస్టమర్ ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో జూబ్లీహిల్స్‌లోని పలు రెస్టారెంట్లపై ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు నిర్వహించారు. అదీకాక సోమవారం బంజారాహిల్స్‌లోని పలు రెస్టారెంట్లపై తెలంగాణ కమిషనర్ ఆఫ్ ఫుడ్ సేఫ్టీకి చెందిన ప్రత్యేక టాస్క్ ఫోర్స్ అధికారులు వరుస దాడులు చేపట్టారు. ఈ సందర్భంగా రోజుల తరబడి నిల్వ ఉన్న ఆహారం ఆ యా రెస్టారెంట్లలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

## నిండుకుండలా
# నిజాంసాగర్ జలాశయం

(మొదటి పేజీ తరువాయి)

ఎస్సారెస్పీకి భారీగా వరద వస్తోంది. ప్రస్తుతం 2 లక్షల 25 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తుండడంతో 3లక్ష 24వేల క్యూసెక్కుల ఔట్ ఎలోను 41 వరద గేట్ల ద్వారా దిగువకు వదులుతున్నారు. ఎస్సారెస్పీలో గరిష్ఠ నీటిమట్టం 1,091 అడుగులు కాగా 1,089 అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం 73.458 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. కాగా, భారీ వర్షాల నేపపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకి రావొద్దని అధికారులు హెచ్చరించారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏ అవసరం వచ్చినా అధికారులకు ఫోన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. నవీపేట మండలంలోని మిట్టాపూర్ శివారులోని వందలాది ఎకరాల పంట నీట మునిగింది. శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్ ముంచెత్తడంతో వరి పైర్లు పూర్తిగా మునిగి పోయాయి. మహారాష్ట్ర ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరికి వరద పోటెత్తింది. మండలంలోని యంచ, నందిగామ, మిట్టాపూర్, కోస్లీ,బినోలా తదితర గ్రామాలకు చెందిన పంట పొలాలను శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్ ముంచెత్తింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

## సాయుధ బలగాలు యుద్ధానికి
# సిద్ధంగా ఉండాల్సిందే

### త్రివిధ దళాలకు రాజ్‌నాథ్ సింగ్ ఆదేశం

**లక్నో,సెప్టెంబర్5(నమస్తే ఉదయం):** శాంతిని కాపాడాలంటే సాయుధ బలగాలు యుద్ధానికి సిద్ధంగా ఉండాల్సిన అవసరం ఉందని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. లక్నోలో ఏర్పాటు చేసిన త్రివిధ దళాల కమాండర్ల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడిన ఆయన.. రష్యా-ఉక్రెయిన్, గాజా సంక్షోభాలతోపాటు బంగ్లాదేశ్‌లో ప్రస్తుత పరిస్థితులను విశ్లేషించాలన్నారు. తద్వారా భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను అంచనా వేసుకోవడంతోపాటు ఊహించని పరిణామాలను దీటుగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. భారత్ శాంతి కోరుకునే దేశమని, దీన్ని కాపాడుకోవాలంటే సాయుధ బలగాలు యుద్ధానికి సిద్ధంగా ఉండాలన్నారు. వాస్తవాధీన రేఖ వెంట నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులను ప్రస్తావించిన ఆయన.. శాంతి, స్థిరత్వానికి ఉత్తర సరిహద్దు, పొరుగుదేశాల్లో నెలకొన్న పరిస్థితులు సవాల్ విసురుతున్నాయన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకొని సైన్యాధికారులు విస్తృత, లోతైన విశ్లేషణ చేయాల్సిన అవసరం ఉందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.



# జనరల్ న్యూస్ GENERAL NEWS

శుక్రవారం ● 06, సెప్టెంబర్ 2024

నమస్తే ఉదయం
తెలుగు దినపత్రిక






సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు

## ధరూర్ మండల కేంద్రంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం..

**ధరూర్, సెప్టెంబర్ 5(నమస్తే ఉదయం):**
ధరూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో, కేజీబివిలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయుల దినోత్సవ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు మాట్లాడుతూ... ఒక సాధారణ వ్యక్తి నుండి భారతదేశంలో అత్యున్నత పదవి అయినటువంటి రాష్ట్రపతి పదవి వరకు చేరుకోవడం జరిగిందని కొనియాడారు. విద్యార్థులు సర్వేపల్లి రాధాకృష్ణన్ ను ఆదర్శంగా తీసుకుని బాగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలని తెలియజేశారు.


## గద్వాల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతి మంగళ, బుధ, శుక్రవారాలలో సదరం క్యాంపుల నిర్వహణ

### జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నర్సింగరావు

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 5(నమస్తే ఉదయం):**
జోగులాంబ గద్వాల జిల్లా లోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతి మంగళ, బుధ, శుక్రవారాలలో సదరం క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నర్సింగరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల వికలాంగులు మొదట మీసేవ కేంద్రాలలో ఈనెల ఆఖరి వరకు సదరం స్లాట్ బుకింగ్ చేసుకోవాలని తర్వాత సర్టిఫికేట్స్ కొత్తవి/ రెన్యువల్ చేసుకోవడానికి వీలవుతుందని అన్నారు. నిర్ణయించిన తేదీల ప్రకారం ప్రభుత్వ హాస్పిటల్ లో హాజరు కావాల్సిందిగా కోరారు. ఈనెల 10, 17, 24 తేదీలలో కంటి వికలత్వం గల వారికి 11,18, 25 తేదీలలో శారీరక వికలత్వం గల వారికి, 12 , 19, 26 తేదీలలో శారీరక, మానసిక వికలత్వం గల వారికి 13 , 20, 27 తేదీలలో చెవిటి, మూగ వికలత్వం గల వారికి ఈ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు హాజరైన వారికి అదే రోజు సదరం సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

## అలంపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్‌గా ఉప్పరి దొడ్డెన్న, వైస్ చైర్మన్‌గా కొమ్ము కుమార్

**గద్వాల ప్రతినిధి,సెప్టెంబర్ 5(నమస్తే ఉదయం):** అలంపూర్ మార్కెట్ యార్డు చైర్మన్ గా ఉప్పరి దొడ్డెన్న, వైస్ చైర్మన్ గా కొమ్ముకుమార్, 16 మందిని కమిటి సభ్యులుగా నియమిస్తూ గతనెల 31 రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెకట్రరీ ఎం.రఘునందన్ రావు ఉత్తర్వులు జారీ చేశారు.



ఈ సందర్భంగా నూతన మార్కెట్ యార్డు పాలక వర్గం ప్రొసెడింగ్ కాఫీలను గురువారం ఏ ఐసిసి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే డా.ఎస్ఏ సంపత్ కుమార్ చేతుల మీదుగా కమిటీ చైర్మన్ దొడ్డెన్న , వైస్ చైర్మన్ కొమ్ము కుమార్‌లు అందుకున్నారు.

హైదరాబాదులోని సంపత్ కుమార్ నివాసంలో జీవో పత్రాన్ని అందుకున్న అనంతరం వారు ఏఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్ ను శాలువాతో సత్కరించారు.

ఈ సందర్భంగా వారికి ఈ అవకాశాన్ని కల్పించిన సీఎం రేవంత్ రెడ్డి కి ,వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## దళిత జర్నలిస్ట్ ఫారం రాష్ట్ర చైతన్య సభ కరపత్రిక ఆవిష్కరించిన గద్వాల్ ఎమ్మెల్యే

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 5(నమస్తే ఉదయం):**



దళిత జర్నలిస్ట్ ఫారం రాష్ట్ర అధ్యక్షుడు కాశపోగు జాన్ ఆద్వర్యంలో ఈనెల 27 జరిగే దళిత జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర చైతన్య మహాసభ హైదరాబాద్ నగరం రవీంద్ర భారతిలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా గద్వాల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి చేతుల మీదుగా దళిత జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర చైతన్య సభ కరపత్రం ఆవిష్కరణ చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ్, నాయకులు గోవిందు, భగీరథ వంశీ, డి. వైఎస్ రామన్న, ధర్మ నాయుడు, గంజి పేట రాజు, జర్నలిస్టులు జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షుడు డి వెంకటన్న, శాంతిరాజు, తాటికుంట తిరుమల్, ఎస్ తిరుమలేష్, మన్నపురం రాముడు, సురేష్, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# ఉపాధి పనుల్లో భారీగా అవకతవకలు

### తూ తూ మంత్రంగా సోషల్ అడిట్

### సామాజిక తనిఖీ బృందాలను మేనేజ్ చేస్తున్నారన్నా ప్రధాన ఆరోపణలు

### చాటింపులు లేకుండానే గ్రామసభలు ముగింపు

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 5(నమస్తే ఉదయం):**
జాతీయ గ్రామీణా ఉపాధి పథకంలో భారీగా అవకవతవకలు జరిగినట్లుఆరోపణలు వస్తున్నాయి. ఉపాధి హామీలలో పనులకు రాని కూలీలకు కూడా మస్తర్లు వేశారని, పనులు చేసిన వారికి కొంతమందికి పేమెంట్లు చెల్లించలేదని ఉపాధి కూలీలు ఆరోపించారు. కొన్ని చోట్ల పనులు చేయకున్న చేసినట్లు మస్టర్లు క్రియేట్ చేసి బిల్లులు కాజేశారని, కొన్ని కావాలనే మట్టిరోడ్ల పనులపై చేసిన పనులకే మళ్లీ బిల్లులు పెట్టారని ఆరోపణలు వస్తున్నాయి.

ముఖ్యంగా రైతు పొలాలో నిర్వహించు ల్యాండ్ లేవింగ్ పనులు చేయకుండానే పనులు జరిగినట్లు మస్టర్లు క్రియేట్ చేశారనీ ప్రధాన ఆరోపణలు. అయితే కార్యదర్శులకు ఉపాధిహామీ పనులపై అవగహన లేకపోవడంతోనే ఈ అవకవతవకలు జరిగాయని తెలుస్తోంది. ఉపాధి పథకంలో అవినీతి, అక్రమాలకు తావులేకుండా నాలుగు రకాల నిఘా వ్యవస్థలను ఏర్పాటు చేసింది. అందులో ప్రధానమైన సోషల్ ఆడిట్ విభాగం ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. ఈ పథకంలో చేసిన ప్రతి పనినీ క్షుణ్ణంగా సామాజిక తనిఖీ విభాగం తనిఖీ చేయాలి. అవకతవకలు గుర్తిస్తే, అందుకు బాధ్యులైన సిబ్బందిపై చర్యలు తీసుకోవడానికి, అవినీతి జరిగిన మొత్తం రికవరీ చేసేందుకు సిఫారసులు చేస్తారు. కానీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సోషల్ అడిట్ పై నిఘా కొరవడిందన్న ఆరోపణలొస్తున్నాయి.

ఉపాధి హామీలో ఎన్ని తప్పులున్నా సోషల్ అడిట్‌లో మాత్రం తనిఖీలు తూతూ మంత్రంగా చేసి.. కప్పిపుచ్చుతూ సరిపెట్టుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా సామాజిక తనిఖీ బృందాలు సరిగా తనిఖీలు చేపట్టలేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. కేటిదొడ్డి మండలంలో 2023–2024 సంవత్సరానికి ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పలు అభివృద్ధి పనులపై సామాజిక తనిఖీలను ఆయా గ్రామా



కొండాపురం గ్రామంలోసోషల్ అడిట్

లలో సోషల్ అడిట్ ద్వారా చేపట్టారు. కేటిదొడ్డి మండలంలో మొత్తం 23 గ్రామాలకు గాను 2023–2024 సంవత్సరానికి సెప్టెంబర్ 1నుంచి సెప్టెంబర్ 10 తేది వరకు సోషల్ అడిట్ చేపట్టారు. సోషల్ అడిట్ ఉపాధి పనులు, కూలీల కు చెల్లించిన వేతనాలు తదితర అంశాలపై సామాజిక తనిఖీ నిర్వహించారు. కాగ సోషల్ అడిట్ కు వచ్చిన బృందం తూ తూ మంత్రంగా సోషల్ అడిట్ నిర్వహిస్తున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. సామాజిక తనిఖీ బృందాలు సరిగా తనిఖీలు చేపట్టడంలేదని, వారిని మేనేజ్ చేసి సరిపెడుతున్నారని ప్రధాన ఆరోపణలు వినవస్తున్నాయి. సోషల్ అడిట్ ద్వారా నిర్వహించు ప్రజావేదికను అయా గ్రామాలలో ఎలాంటి చాటింపు చేపట్టకుండా గుట్టు చప్పుడుగా గ్రామసభలు నిర్వహిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

సోషల్ అడిట్‌కు ఎలాంటి చాటింపు లేకపోవడంతో ఈ సమావేశానికి ప్రజలు ఎవరూ హాజరు కాకపోవడం గమనార్హం. ఏది ఏమైనా ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై సోషల్ అడిట్ నిర్వహించి. అవకవతవకలు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై కేటిదొడ్డి మండల ఎంపిడిఓ కృష్ణమోహన్‌ను వివరణ కోరగా.... సోషల్ అడిట్‌లో అవకతవకలను పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటాం. సోషల్ అడిట్ సందర్భంగా గ్రామ సభలకు ముందుగానే చాటింపు చేయించామన్నారు.

# సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకం

### - కలెక్టర్ సంతోష్

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 5(నమస్తే ఉదయం):**
విద్యార్థుల అభివృద్ధి, భవిష్యత్తు సాధనలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని అనంత ఫంక్షనల్ హాల్‌లో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి పురస్కరించుకొని చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఊ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యా యుల సన్మాన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్, గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంబించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... చిన్నప్పటి నుండి పెద్దయ్య వరకు విద్యార్థి యొక్క వ్యక్తిత్వం, అభివృద్ధి మరియు భవిష్యత్తు సాధనలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. గద్వాల ప్రాంతంలో ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నేటి కాలంలో ఉపాధ్యాయులు కొత్త టెక్నాలజీని ఉపయోగించి విద్యను అందించడం అవసరమని స్పష్టం చేశారు. ప్రతి టీచర్ 5 మంది విద్యార్థులను అడాప్ట్ చేసుకొని మోటివేట్ చేసి వాళ్ళను ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నారు. టీచర్ యొక్క ప్రవర్తనను బట్టి పిల్లల ప్రవర్తన ఉంటుందాని కావున ఉపాధ్యా



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

యులు ఉన్నతంగా ఉంటూ పిల్లలకి చదువుతోపాటు, ఫిజికల్ ఎడ్యుకేషన్ కూడా ఇవ్వాలని అన్నారు. గద్వాల్ శాసనసభ్యులు స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ కింద గవర్నమెంట్ గర్ల్స్ హై స్కూల్ కు 60 లక్షలు, గవర్నమెంట్ గర్ల్స్ జూనియర్ కాలేజ్ కి 75 లక్షలు, జడ్పీహెచ్ఎస్ రేవులపల్లికి 50 లక్షలు, ఎంపీపీఎస్ బురెడ్డిపల్లికి 30 లక్షలు నిధులు కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు.

అనంతరం గద్వాల్ శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి రంగానికి ఒక గురువు ఉంటారని అన్ని రంగాల్లో ఉన్నతంగా అభివృద్ధి చెందడానికి గురువుల తోడ్పాటు అవసరమని అన్నారు. మనకు తల్లి జన్మనిచ్చిన మిగిలిన జీవితం అంత గురువు నుండి అభివృద్ధి జరుగుతుందని అన్నారు. మీ కృషి ద్వారా ఈ జిల్లాకు మంచి పేరు తీసుకురావలని తెలిపారు.

గద్వాల్ జిల్లాలో 53 మంది ఉత్తమ ఉపాధ్యాయులగా ఎంపిక చేసిన వారిని జిల్లా కలెక్టర్, గద్వాల్ శాసనసభ్యులు, అదనపు కలెక్టర్ ప్రశంస పత్రం, మేమెంటో, శాలువా, పూలమాలతో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో అదరపు కలెక్టర్ నర్సింగా రావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, ప్రధానోపాధ్యాయులు , ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మణికొండ జలమండలి మేనేజర్ స్వార్తిరెడ్డికి బెయిల్ నిరాకరణ

### మణికొండ జలమండలి మేనేజర్ స్వార్తిరెడ్డి బెయిల్ పిటిషన్‌ను స్థానిక కోర్టు తిరస్కరించింది.

### మణికొండ జలమండలి మేనేజర్ స్వార్తిరెడ్డికి బెయిల్ నిరాకరణ

**సిటీబ్యూరో, సెప్టెంబర్ 5(నమస్తే ఉదయం):**
అవినీతి నిరోధక శాఖ ఏసీబీ వలలో చిక్కన హైదరాబాద్‌లోని మణికొండ జలమండలి మేనేజర్ స్వార్తిరెడ్డి బెయిల్ పిటిషన్‌ను స్థానిక కోర్టు తిరస్కరించింది. ఆగస్ట్ 21న నల్లా కనెక్షన్ కోసం మేనేజర్ స్వార్తిరెడ్డి, అవుట్ సోర్సింగ్ ఉద్యోగి నవీన్‌గౌడ్‌ను రూ.30వేలు లంచం తీసుకుంటుండగా హైదరాబాద్ సిటీ రేంజ్–2 యూనిట్ ఏసీబీకి పట్టుబడ్డారు. అయితే, మేనేజర్ స్వార్తి తాను నిర్దోషిని అంటూ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీంతో కోర్టులో వాదనలు జరిగాయి. ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్‌తో తన కుమార్తె బాధపడుతుండటంతో ఆమె బెయిల్ కోరారు.

అయితే, ఏసీబీ తరపు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదిస్తూ కేసుకు సంబంధించి దర్యాప్తు ప్రాథమిక దశలో ఉండటం.. ఇంకా చాలామంది సాక్షులను విచారించి, ముఖ్యమైన పత్రాలను సేకరించాల్సి ఉన్నదని కోర్టుకు తెలిపారు. మరోవైపు పిటిషనర్ బెయిల్‌పై విడుదల అయితే సాక్షులను ఆమె ప్రభావితం చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లోని ఎస్‌పీఈ అండ్ ఏసీబీ కేసుల ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి వివరిస్తూ.. ఇక్కడ పిటిషనర్ మైనర్ కుమార్తె ఆటిజం డిజార్డర్‌తో బాధపడుతోందని పిటిషనర్ వాదన ఆందోళన కలిగిస్తున్నప్పటికీ, దర్యాప్తు దశలో కేసు ఉన్న నేపథ్యంలో వాదనను పరిగణనలోకి తీసుకోలేమని స్వార్తి రెడ్డికి బెయిల్ నిరాకరించారు.

కాగా, లంచం తీసుకుంటూ పట్టుబడ్డ స్వార్తిరెడ్డిపై పలు అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు వల వేసి పట్టుకున్నారు. అయితే, సోదాలకు వెళ్లే సమయంలో ఏసీబీ అధికారులకే స్వార్తి చుక్కలు చూపించారు. దాదాపు రెండుగంటల పాటు తాను ఉంటున్న ఇంటి అడ్రస్‌ను



చెప్పలేదు. తప్పుడు అడ్రస్‌లు చెబుతూ అధికారులను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించారని ఆరోపణలు వచ్చాయి. చివరకు అధికారులు ఇంటి అడ్రస్‌ను తెలుసుకొని వెళ్లారు. అనంతరం సోదాలు నిర్వహించగా అక్రమ ఆస్తులకు సంబంధించిన పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

# ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రత్యేకత రోడ్డు పునరుద్ధరణ పనులు

**కొత్తకోట, సెప్టెంబర్ 5(నమస్తే ఉదయం):**
కొత్తకోట మండలం రామకృష్ణాపురం గ్రామంలో పామాపురం వెళ్లే దారిలో రామన్ పాడు కాల్వ కల్వర్టు ఒకవైపు కూలి రాకపోకలకు అంతరాయం కలిగింది. ఈ విషయాన్ని గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవరకద్ర నియోజకవర్గం శాసనసభ్యులు జి మధుసూదన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే జిఎంఆర్ నీటిపారుదల శాఖ డి ఈ, ఏ ఈ లతో మాట్లాడి కల్వర్టు పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. వెంటనే అధికారులు రోడ్డు పునరుద్ధరణ పనులు చేపట్టారు. దీంతో ఇరువురు గ్రామాల రాకపోకలకు ఇబ్బందులు తొలిగాయి. రామకృష్ణాపురం గ్రామ ప్రజలు దేవరకద్ర జిఎంఆర్‌కి కృతజ్ఞతలు తెలిపారు.



రోడ్డు పునరుద్ధరణ పనులు చేస్తున్న గ్రామస్తులు



జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు అందుకుంటున్న స్వప్న శ్రీ రామ్

## జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయినిగా స్వప్న శ్రీ రామ్

**బుద్వేల్, సెప్టెంబర్5(నమస్తే ఉదయం):** రంగారెడ్డి జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా కాటేదాన్ శాంతినగర్‌లో గల రవి బ్రిలియంట్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు స్వప్న శ్రీ రామ్ అవార్డును తీసుకున్నారు. గురువారం సాయంత్రం రవీంద్ర భారతి లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శశాంక, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ల తోపాటు ఇతర ప్రముఖుల చేతుల మీదుగా ఆమె జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా మేమేంటోను అందుకున్నారు. స్వప్న శ్రీ రామ్ 15 సంవత్సరాలుగా శాంతినగర్‌లో గల రవి బ్రిలియంట్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలుగా ఉంటూ అనేకమంది విద్యార్థులను తీర్చిదిద్దారు.

## గణేష్ ఉత్సవాల ఏర్పాట్లును సకాలంలో చేపట్టాలి: గణేష్ ఉత్సవ సమితి

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 5(నమస్తే ఉదయం):** గణేష్ ఉత్సవ ఏర్పాట్లను సకాలంలో చేపట్టాలని రాజేంద్రనగర్ సర్కిల్ గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు అధికారులను కోరారు. గురువారం రాజేంద్రనగర్ లోని హనుమాన్ నగర్ పత్తి కుంట వద్ద భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటి కమీషనర్ రవికుమార్ ,ఏ ఈ వెంకోభ , శానిటేషన్ డి ఇ శ్రీనివాస్ , వివిధ శాఖల అధికారులు



సందర్శించి పరిశీలించారు. 7 వ తేదీన గణేష్ ప్రతిష్ట నుండి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ వై శ్రీధర్ కోరారు .ఈ కార్యక్రమంలో సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కే రవికుమార్, గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు మల్లా రెడ్డి, ఎం కొమరయ్య , జోగి రవి.జి బాబురావు డి సత్యనారాయణ తొందుపల్లి మల్లేష్ ఈ వేణుగోపాల్ స్ జయనంద్ రెడ్డి పి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 5(నమస్తే ఉదయం):** విద్యుత్ షాక్ తో ఎద్దు మృతి చెందిన ఘటన గురువారం గద్వాల మండల పరిధిలోని జంగన్ పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నాగరాజు పశువులను వ్యవసాయ పొలంలో మేతకు తీసుకెళ్లాడు. ఈక్రమంలో ఓ ఎద్దు పొలం పక్కన ఉన్న ట్రాన్స్ఫార్మర్ దగ్గర మేత మేస్తుండగా వప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ గురై మృతి చెందింది. రూ. 80వేలు విలువ చేసే ఎద్దు మృతి చెందడంతో రైతు కన్నీరు మున్నీర య్యారు. పశువైద్యాధికారి పోస్టుమార్టం నిర్వహించారు.



## ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

**- ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**నార్సింగి, సెప్టెంబర్5(నమస్తే ఉదయం):** ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ అన్నారు. గురువారం నార్సింగి మునిసిపాలిటీ పరిధిలో గల 1,2,3,11,12,13 ,14వ వార్డులలో రూ. 10.10 కోట్లతో శాసనసభ సభ్యులు టి. ప్రకాష్ గౌడ్ ,ముదిరాజ్ కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ , మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణ మోహన్ రెడ్డి లతో కలిసి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ... అభివృద్ధి పనులు ప్రణాళిక విధంగా నాణ్యతగా చేపట్టాలని అధికారులకు ప్రజలు ఏ సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

వాటికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మైలరం నాగపూర్ణ శ్రీనివాస్ , వైస్ చైర్మన్ గోపాల విజయ్, కౌన్సిలర్స్ బొల్లి యధమ్మ , దార్గుపల్లి రేఖాయదగిరి , దుర్గేష్ యాదవ్ , శివారెడ్డి , కె లక్ష్మీ ప్రవల్లిక కిరణ్ , గోపాల సునీత గణేష్ , గున్నాల అమరేందర్ రెడ్డి , విజేత ప్రశాంత్ యాదవ్ , ఆదిత్య రెడ్డి , నరేష్ , డి ఈ నరసింహ రాజు, మేనేజర్ యోగేష్ , ఏ ఈ శ్రీనివాస్ , మున్సిపల్ సిబ్బంది , ముఖ్య ప్రజా ప్రతినిధులు , ప్రజలు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్

# కె.రవి కుమార్‌ను బదిలీ చేయాలి

**రాజేంద్రనగర్, సెప్టెంబర్5(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్ ను బదిలీ చేయాలని, భాగ్య నగర్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ (బీఎంఈయూ) అధ్యక్షుడు కె.శంకర్ అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయం రెవెన్యూ సెక్షన్‌లో పని చేసే అధికారులు, సిబ్బంది ముకుమ్మడిగా డిప్యూటీ కమిషనర్ కు వ్యతిరేకంగా గురువారం సర్కిల్ కార్యాలయం ముందు నిరసనకు దిగారు. రాజేంద్రనగర్ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ జయ ప్రకాష్ ఆధ్వర్యంలో కార్యాలయం ముందు గురువారం బైఠాయించి ఆందోళన చేపట్టారు.

ఈ సందర్భంగా బీ.ఎం.ఈ యూ అధ్యక్షుడు కె. శంకర్ మాట్లాడుతూ.... రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో పనిచేస్తున్న అన్ని శాఖల సిబ్బందిని తన చెప్పుచేతల్లో పెట్టుకోవాలని డిప్యూటీ కమిషనర్ ప్రయత్నిస్తున్నారని అన్నారు. డీసీ చెప్పిన పని చేయకుంటే మెమోలు ఇచ్చి ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని మండిపడ్డారు. ఆరోగ్య సమస్యలపై సెలవులు అడిగితే ఇవ్వకుండా ఉద్యోగులను వేధిస్తున్నారని తెలిపారు. ప్రతి పనికి ఓ రేటును ఫిక్స్ చేశారని, పనులు కావాలంటే పైకం చెల్లించాల్సిందే అన్నారు. 25 సంవత్సరాలుగా నగరంలో నే విధులు నిర్వహిస్తూ తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు. డీసీకె. రవి కుమార్‌ను బదిలీ చేసేంతవరకు కలెక్షన్‌ను వసూలు చేయమని హెచ్చరించారు.ఆందోళన కార్యక్రమంలో రాజేంద్రనగర్ టి ఐ లు యాదయ్య, మహేందర్ గౌడ్, జగన్, ప్రవీణ్ బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న ఉద్యోగ సంఘం నాయకుడు కె. శంకర్

### సమయానికి విధులకు హాజరు కావాలన్నందుకు తనపై లేనిపోని నిందలు వేస్తున్న సిబ్బంది: డీసీ కె. రవికుమార్

గ్రేటర్ కమిషనర్, మేయర్ ఉత్తర్వుల మేరకు సమయానికి విధులకు హాజరు కావలసిందిగా కింది స్థాయి సిబ్బందిని కోరడం తన తప్పైందని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్ అన్నారు.

ఉన్నతాధికారుల ఉత్తర్వులను బేకతరు చేసినందుకు మెమో ఇస్తాను అన్నందుకు తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఉన్నతాధికారుల ఆంక్షల మేరకు నెలలో మూడు రోజులు ఆఫీస్‌కి లేటుగా వస్తే ఒక సీఎల్ వేయమని తెలిపా రన్నారు. ఆస్తిపన్ను ఆగస్టు నెలలో 45 శాతం మాత్రమే వసూలు చేసారని తెలిపారు. ఆఫీసుకు రాకుండా... లీవ్ పెట్టకుండా... కనీసం సమాచారం ఇవ్వకుంటే ఎలా కన్సిడర్ చేయాలని ప్రశ్నించారు. ప్రాపర్టీ టాక్స్ కలెక్షన్ టార్గెట్ రీచ్ కావాలని పదే పదే చెప్పినటికీ పెడచెవిన పెట్టారని తెలిపారు. ఏఎంసీ జయప్రకాష్ కు ఇంతకుముందే విధులకు సరిగ్గా హాజరుకావాలని తెలుపుతూ రెండుసార్లు మేమోలు ఇవ్వడం జరిగిందని, దానికి ఆయన రిప్లై కూడా ఇచ్చారని తెలిపారు. మూడోసారి మెమో ఇస్తాను అన్నందుకే తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు.





పితృ వియోగం కలిగిన ఎమ్మెల్యే జిఎంఆర్ ను పరామర్శించిన ప్రణాళిక సంఘము ఉపాధ్యక్షులు డాక్టర్ బి చిన్నారెడ్డి, ఎమ్మెల్యే జిఎంఆర్ ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర్ రెడ్డి

# దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్‌కు పితృవియోగం

### ఎమ్మెల్యే జిఎంఆర్‌ను పరామర్శించిన ప్రముఖులు

**దేవరకద్ర, సెప్టెంబర్5(నమస్తే ఉదయం):** దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డికు పితృవియోగం కలిగింది. గురువారం ఎమ్మెల్యే జిఎంఆర్ మాతృమూర్తి గవినోల్ల కృష్ణారెడ్డి నియోజకవర్గంలోని చిన్నచింతకుంట మండలం ధమగ్నపూర్‌లో స్వర్గస్తులైనారు. ఎమ్మెల్యే జిఎంఆర్ తండ్రి జి కృష్ణారెడ్డి మరణ వార్త తెలుసుకున్న పలువు రు



కృష్ణారెడ్డి పార్థివ దేహానికి నివాళులర్పించారు. ఎమ్మెల్యే జిఎంఆర్‌ని, వారి కుటుంబ సభ్యులను ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి , మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం. శ్రీనివాస్ రెడ్డి , మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, గద్వాల్ ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, గద్వాల నియోజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు, మాజీ జడ్పీ చైర్ పర్సన్ సరిత తిరుపతయ్య తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ తండ్రి కృష్ణారెడ్డి (ఫైల్ ఫోటో)

# గగన్ పహాడ్ మామిడి కుంటలో నీరు ఉండకుండ చేస్తున్న పరిశ్రమల యజమానులు

**రాజేంద్రనగర్, సెప్టెంబర్5(నమస్తే ఉదయం):** గగన్ పహాడ్ మామిడికుంట చెరువులో నీరు నిలువ ఉండకుండా వచ్చినవి వచ్చినట్లు కిందికి వెళ్లే టట్లు స్థానిక వ్యాపారులు కట్ట తెంచు తున్నారు. చెరువు కట్టను సరిగ్గా నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి మామిడికుంట నిండడంతో చెరువు మంచిగా కనిపించిందని, అయితే తూములు , కట్ట సరిగా లేకపోవడం వల్ల నీరంత కిందికి వెళ్లిపోతుందని గగన్ పహాడ్ వాసులు వాపోయారు. మామిడికుంట చెరువు సర్వే నెంబర్ 247లో 19.15 ఎకరాలలో విస్తరించి ఉందన్నారు . ఈ చెరువు శిఖం పట్టా కావడంతో చెరువులో నీరు ఉండకుండా శిఖం పట్టా ఉన్నవారు నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి పన్నాగం పన్ని చెరువులో నీళ్లు ఉండకుండా చేస్తున్నారని గగన్ పహాడ్ బస్తీకి చెందిన యువకులు వాపోతున్నారు. మామిడికుంట చెరువు నిండినప్పుడు నీళ్లు అలుగు పారాలి కాని ...కింది భాగంలో నుంచి నాలా లాగా కట్టడంతో మామిడికుంట ఒక్కరోజులోనే ఖాళీ అవుతుందన్నారు. అప్పచెరువులో కూడా నాలా కిందికి ఉండడంతో అక్కడ కూడా ఒక్క చుక్క నీరు చెరువు లో నిలువ ఉండటం లేదని గుర్తు చేశారు. ఈ చెరువులు వాటి కట్టల నిర్మాణపై హైడ్రా అదికారులు దృష్టి సారించాలని గగన్ పహాడ్ బస్తీ ప్రజలు కోరుతున్నారు.

చెరువులోంచి క్రిందకు పారుతున్న నీరు



Printed and Published MEKALA DAMODAR REDDY on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699. Cell: 9492148733